# ఉభయకుశలోపరి

జాస్తి రమాదేవి

ఆఫీసు నుంచి ఇంటికి రాగానే కంప్యూటర్ ముందు కూర్చుని మెయిల్స్ చెక్ చెయ్యటం అలవాటు. ప్రతీ రోజు మెసేజ్‌లు, బిజినెస్ టెక్‌నిక్‌లు, ఏవేవో ఇన్ఫర్మేషన్స్ తెల్సిన వాళ్ళు పంపించే లెటర్స్...అన్నీ వరసగా చెక్ చేసి అవసరమైన వాటిని ఫైల్ చేసి పనికిరాని వాటిని డిలీట్ చెయ్యటం రోజూ జరిగేదే. అమ్మ రాసిన లెటర్ కనిపించింది.

"ప్రియమైన చంద్రం! అమ్మ ఆశీర్వదించి వ్రాయునది. ఉభయకుశలోపరి.."

నవ్వొచ్చింది. ఈ కంప్యూటర్ యుగంలో కూడా అమ్మ ఉత్తరాల భాష మర్చిపోదు. ప్రతి ఉత్తరంలోనూ ఆశీర్వాదం. ఉభయకుశలోపరి.

"చంద్రం! ఎప్పటికప్పుడు నువ్వు వస్తున్నావని ఆశపడ్డంతోనే కాలం గడిచిపోతోంది. ఒక్కసారి వీలు చూసుకుని పిల్లల్ని కోడల్ని తీసుకుని ఇండియాకి రారా! నీ పిల్లలకు 'మా నాన్న ఇక్కడ పుట్టి పెరిగాడ'న్న విషయమైనా తెలియాలిగా..అందరూ నిన్ను చూడాలని ఆశపడుతున్నారు. ఆ! చంద్రం! చిన్నప్పుడు నిన్ను ఎత్తుకు మోసిన సత్తెయ్య గుర్తున్నాడా నీకు.."

'ఏమిటి అమ్మ?...ఎప్పుడో ఎత్తుకు మోసిన సర్వెంటు గుర్తున్నాడా అంటుంది. ఈ ఫాస్టు యుగంలో క్షణం క్రితం జరిగిందే గుర్తుండేంత తీరిక ఉండటం లేదు. ఎప్పుడో చిన్నప్పుడు..నాన్‌సెన్స్..'

"చంద్రం! ఈమధ్య వాడికి ఆరోగ్యం బాగా లేదురా..నేను మీ నాన్న చూడ్డానికి వెళ్ళినప్పుడు నిన్నే అడిగాడు. 'అమ్మా! నేను సచ్చిపోయేలోపు బండబాబుని వొక్కసారి రమ్మని సెప్పండి...చూసి సచ్చిపోతాను" అన్నాడు.

చిన్నప్పుడు నువ్వు బొద్దుగా ఉండేవాడివని. నిన్నలా పిలిచేవాడు. వాడిని నిన్ను ఎత్తుకోవటం కోసమే పన్లో పెట్టుకున్నాము. ఐదేళ్ళపాటు వాడు నిన్ను కంటికి రెప్పలాగా చూసుకున్నాడురా. ఒక్కసారి వీలు చూసుకుని వొచ్చి వాడిని చూస్తే బాగుంటుంది.

ఇట్లు

అమ్మ..."

అమ్మకి చాదస్తం కాకపోతే ఓ సర్వెంట్‌ని చూడ్డానికి ఇండియాకి రమ్మంటుంది. నన్ను మోసినందుకు వాడ్ని పన్లో పెట్టుకున్నారు. అందుకు పొలం ఇచ్చి ఉంటారు. అంతే..వాడు తర్వాత మరెక్కడో చేసి ఉంటాడు. అలాంటి వాడ్ని చూడ్డానికి నేను పన్లు మానుకుని..నాన్‌సెన్స్..

లెటర్ డిలీట్ చేస్తుండగా శ్రీకాంత్ చాటింగ్‌లోకొచ్చాడు.

"హాయ్! హౌ ఆర్యూ.." అడిగాడు.

"ఫైన్.." షరామామూలేగా.

"వాటార్యు డూయింగ్?" అడిగాడు.

"అమ్మ లెటర్ చూస్తున్నాను. ఏమిటి సంగతులు?" అడిగాను.

"నెక్స్ట్ సండే ఇంట్లో చిన్న గెట్టుగెదర్ పార్టీ ఉంది. నిత్య, నువ్వు, పిల్లలు తప్పకుండా రావాలి" అన్నాడు.

"నాయినా! ఇంకా నువ్వు భారతదేశంలోనే ఉన్నట్టున్నావు"

"ఏమిటి!" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇక్కడి పంక్చువాలిటి తెల్సి కూడా నెక్స్ట్ సండే పార్టీకి ఇప్పుడు ఇన్‌వయిట్ చేస్తున్నావు. టూ మంత్స్ ముందే ఈ సండే, నెక్స్ట్ సండే ఫిలప్ అయిపోయాయి. సారీరా.." అన్నాను.

"ఏడ్చావులే...ఎక్కువమందిని పిలవలేదు. నువ్వు, శ్రీధర్, శంకర్, శ్రీనివాస్, ఫేమ్లీస్‌తో...అంతే"

"పిల్లలు వాళ్ళ ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ ఉందన్నారు. నిత్య వాళ్ళ కొలీగ్ వాళ్ళమ్మాయి ఎంగేజ్‌మెంట్‌కి నేను నిత్య, వెళ్ళాల్సి ఉంది. సరే నీ కోసం నేను ఎలాగో తప్పించుకుని వచ్చేస్తాను" అన్నాను.

"థాంక్సరా..బై"

నేను కంప్యూటర్ ఆఫ్ చేసి లాన్‌లోకి నడిచాను. పిల్లలూ, నిత్య ఇంకా ఇంటికి రాలేదు. అక్కడున్న పైపు తీసుకుని మొక్కలకు నీళ్ళుపోస్తూ నిత్య కోసం ఎదురు చూడసాగాను.

○○○

సండే రానే వచ్చింది.

నేను శ్రీకాంత్ వాళ్ళింట్లో గెట్టుగెదర్ పార్టీకి వెళ్ళాలని ముందే నిత్యకి చెప్పటంతో పెద్దగా ఆర్గ్యుమెంట్ జరగలేదు.

ప్రతి విషయాన్ని తేలిగ్గానే తీసుకుంటుంది నిత్య. ఒక్కోసారి అది బాధగా అన్పించినా వొక్కసారి అది కరెక్టేమో అన్పిస్తుంటుంది.

నేను శ్రీకాంత్ వాళ్ళింటికి వెళ్ళేసరికి అప్పటికే మిత్ర బృందం చేరిపోయి కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏంరా! చంద్రం! ఇంత లేటు..కమ్ కమ్.." శ్రీకాంత్ ఎదురు వచ్చి ఆహ్వానించాడు.

"స్వాగతం..సుస్వాగతం.." మిగిలిన వాళ్ళు నవ్వుతూ అన్నారు.

"చాల్లేండిరా.." అంటూ మొహమాటంగా నవ్వి వాళ్ళతో జాయిన్ అయ్యాను.

ఎన్నెన్ని కబుర్లో జోక్‌లు..ఫ్రెండ్స్‌మి కలిస్తే చాలు..కాలేజీ రోజులకి వెళ్ళిపోతాము. ఆ రోజులు గుర్తొచ్చినంతగా ఇంకేం గుర్తుకు రావు.

"శ్రీ! మీ నాన్న ఇంకా కార్డులు రాస్తూనే ఉన్నారా!" అడిగా నేను.

"కార్డులు కాదు కానీ..ఇక్కడికి వచ్చిన కొత్తలో కవర్లు రాసేవారు. ఈ రోజుల్లో అదీ కష్టమే కదా..నాన్నకి సెల్‌ఫోన్ కొనిచ్చాను. రోజూ అందరికీ మెసేజ్‌లు పంపుతుంటారు. ఎవరో ఒకళ్ళు రిప్లయ్ ఇస్తుంటారు. నాన్నకి ఎంత సంతోషమో..మేమంతా ఇంటికి వచ్చాక అది చాలా సంతోషంగా చదివి విన్పిస్తుంటారు. ఆ టైమ్‌లో ఆయన మొహం ఎంత తృప్తిగా సంతోషంగా ఉంటుందో తెల్సా చంద్రం. 'నేనిక్కడ క్షేమంగా ఉన్నాను' అనే చిన్న మెసేజ్, ఆయనకి కావాల్సినంత తృప్తి..మనం నెలంతా కష్టపడి వేల డాలర్లు తీసుకుంటూ ఏనాడూ అంత తృప్తిగా ఫీలయి ఉండం అన్పిస్తుంటుంది నాకు" శ్రీకాంత్ గొంతులో తడి తెలుస్తుంది.

నాకు అమ్మ లెటర్స్ గుర్తొచ్చాయి.


ఆశీర్వాదం..ఉభయకుశలోపరి...ఇలాంటి పదాలింకా ఎందుకు మర్చిపోదు అని విసుక్కున్న సందర్భాలు గుర్తొచ్చాయి.


శ్రీకాంత్‌గాడి సెంటిమెంట్‌కి నాకేం కామెంట్ చెయ్యాలన్పించలేదు.

డ్రింక్స్ సర్వ్ చేస్తూ సంభాషణ కొనసాగించాడు శ్రీకాంత్.

"మా చిన్నతనంలో నాన్న ఏ విషయాన్నయినా కార్డు మీద కుదించి రాసి వాళ్ళ క్షేమ సమాచారాన్ని తెలియజేయమని కోరుతూ పోస్ట్ చేసేవారు. రోజూ పోస్ట్‌మేన్ కోసం ఎదురుచూడ్డం ఆయన దినచర్యలో భాగం. తరచూ మా ఇంటికి పోస్ట్‌మేన్ వచ్చి ఏదోక ఉత్తరం ఇచ్చేవాడు. మమ్మల్ని పిలిచి దగ్గర కూర్చోబెట్టుకుని ఆయన ఉత్తరంలో సమాచారం చక్కగా చదివి విన్పించేవారు.

అమ్మ అప్పుడప్పుడూ విసుక్కునేది. 'నెలకి పది రూపాయలు కార్డుల కోసం తగలేస్తారు. ఎంచక్కా బోలెడు కూరగాయలవీ వచ్చేవి' అంటే నాన్నకి ఎప్పుడూ కోపం వచ్చేది కాదు. అమ్మ ప్రశ్నకి జవాబుగా ఆయన నవ్వి "పిచ్చిదానా! మన వాళ్ళందరూ ఎక్కడో ఓ చోట క్షేమంగా ఉన్నారని ఈ కార్డు ముక్క తెలియజేస్తుంది. అది మనసుకెంత సంతోషం" అనేవారు. నిజమేకదా! ఇప్పుడు చూడు మనం ఎంత బిజీ. మన వాళ్ళంటూ ఎక్కడున్నారో ఎలా ఉన్నారో తెలియదు. తెల్సుకోవాలన్న ప్రయత్నమూ చేయము.





అంతలో శ్రీ వాళ్ళ నాన్నగారు విశ్వనాథంగారు అక్కడికొచ్చి అందర్నీ పలకరించారు.

"ఏం అంకుల్! ఈరోజు మెసేజ్ ఏమిటి?" అడిగాన్నేను. ఆయన సెల్‌ఫోన్‌లో వచ్చిన మెసేజ్ చదివి వినిపించారు.

"స్వేచ్ఛ అనేది నువ్వు కోరుకోవటంలో లేదు. నువ్వు పొందటంలో లేదు"

"వావ్" అన్నాం అందరం క్లాప్స్ కొడుతూ.

తర్వాత అందరం డిన్నర్ పూర్తి చేసాము.

"చంద్రం! నేను టూ వీక్స్‌లో ఇండియా వెళ్తున్నాను. నువ్వు ఏమైనా ఇస్తే తీస్కెళతాను" అన్నాడు శంకర్.

"సరే" అన్నాను.

ఒకరికొకరం మళ్ళీ ఎప్పుడు కలుస్తామో అనుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నాము. మేమంతా ఒకేసారి అమెరికా వచ్చి సెటిలయిన స్నేహితులం.

ఆ మర్నాడు నిత్యతో చెప్పాను. "శంకర్ ఇండియా వెళుతున్నాట్ట ఏమైనా ఇస్తే తీస్కెళతాను" అన్నాడు. అంటే "చూద్దాం.." అంది.

కొన్నాళ్ళ క్రితం అక్క చేసిన కామెంట్ గుర్తొచ్చింది.

"ఏమిట్రా! ఎప్పుడూ సబ్బులూ షాంపూలు పంపిస్తావు. అవేవీ ఇండియాలో దొరకవనుకుంటున్నావా! పోనీ అవి మేము వాడే బ్రాండ్ కూడా కావాలి. కొంచెం వెరైటీగా ఉండేవి పంపరా బాబు!" అంది.

ఆ మాటే నిత్యతో చెప్పి-

"అమ్మకి వెరైటీగా ఏం పంపించుదాము!" అడిగాను.

"వైట్‌హౌస్ పంపించండి వెరైటీగా ఉంటుంది" అంటూ తెలిగ్గా నవ్వింది.

అర్థమయ్యిందో లేదో తెలీదుగానీ పిల్లలు కూడా నవ్వారు.

కొంచెం ఖాళీ చేస్కుని నేను నిత్య షాపింగ్ చేసాము. ఎవరికి ఇవ్వాల్సిన వాటి మీద వాళ్ళ పేర్లు రాసేసి హమ్మయ్య అనుకుంటూ శంకర్‌కి అప్పగించేసాము. ఓ పనయిపోయింది అనుకుంటూ రిలీఫ్ ఫీలయ్యాను.

○○○

రెండు వారాల అనంతరం అమ్మ రాసిన లెటర్ని చదివాక నాకు చేదు తిన్నట్టుగా అన్పించింది. మనస్సు అదోలా అయిపోయింది.

"చి.చంద్రం! అమ్మ ఆశీర్వదించి వ్రాయునది. ఉభయకుశలోపరి. శంకర్‌తో నువ్వు పంపించినవి అన్నీ అందాయి. నీ క్షేమ సమాచారాలు తెలిసాయి.

చంద్రం! నువ్వు ఎంతో ఇదిగా పంపిన చేతికర్ర చూడకుండానే సత్తెయ్య చనిపోయాడురా. రెండు వారాల క్రితమే వాడు ఈ లోకానికి దూరమయ్యాడు. పక్షవాతంతో వాడి కాళ్ళు పడిపోయాయి. నీ చిన్నప్పుడు నువ్వు చేసిన అల్లరి పని కారణంగా ఓ చెయ్యి పోగొట్టుకున్నాడురా వాడు. బండి చక్రం ఊడదీసి దానికి అడ్డుగా రాయి పెట్టి ఉంచారు మీ నాన్న. నువ్వెళ్ళి ఆ రాయి లాగేసావు. బండి నీ మీదికి వస్తుందని భయపడి చేతిని బండి చక్రానికి అడ్డుపెట్టాడురా. బండి పల్లంలోకి వచ్చేసింది. అప్పుడే వాడి చెయ్యి విరిగిపోయింది. పాపం ఒక చెయ్యి లేదని వాడికి పెళ్ళి కూడా కాలేదురా!

నాన్న వైద్యం చేయించాలనుకుంటే వొద్దని గోల చేసాడు. కాళ్ళు చేతులు లేని తను ఎవరికీ భారం కాకూడదని ఏడ్చాడు. వాడు ఉండి ఉంటే నువ్వు పంపిన చేతికర్ర చూసి ఎంత సంబరపడిపోయేవాడో! పిచ్చి సన్నాసి...ఉంటాను చంద్రం..అమ్మ.."

మనస్సులో ఏదో తెలియని స్తబ్ధత. నేను పంపిన చేతికర్ర చూసి సత్తెయ్య ఎంతగా మురిసిపోయుంటాడో. తనని మర్చిపోనందుకు సత్తెయ్య ఎంతగా ఆనందపడ్డాడో... అమ్మ కళ్ళకు గట్టినట్టుగా ఉత్తరం రాస్తుందని ఎప్పుడూ చూడనంతగా అమ్మ ఉత్తరం కోసం ఎదురుచూస్తూ ఉన్నాను. చివరికి నేను పంపిన చేతికర్ర ఉపయోగించుకోకుండానే చనిపోయాడని అమ్మ ఉత్తరం రాయటం మనస్సుకు చేదుగా ఉంది.

అమ్మ కోరినట్లుగా ఒక్కసారి వెళ్ళి సత్తెయ్యను చూసి ఉంటే బావుండేదేమోనన్న గిల్టీఫీలింగ్ నిలకడ లేకుండా నన్ను కుదిపేస్తోంది.

"ఏమిటి చందూ! అలా ఉన్నారు. ఎనీ ప్రోబ్లం" అని

నిత్య రెండు, మూడుసార్లు అడిగింది. 'నథింగ్' అన్నాను. విషయం ఇదీ అని నిత్యతో చెప్పినందువల్ల ఏం ప్రయోజనం లేదు. 'సిల్లీ' అంటూ తేలిగ్గా నవ్వుతుంది.

సడెన్‌గా అప్పుడు విశ్వనాథం అంకుల్ గుర్తొచ్చారు. శ్రీ వాళ్ళ నాన్న నా ప్రోబ్లం విన్నాక ఆలోచిస్తూ నా వైపు చూసి...

"ముందిలా కూర్చో చంద్రం" అన్నారు.

లాన్‌లో సిమెంట్ బెంచిమీద ఇద్దరం పక్కపక్కనే కూర్చున్నాము.

శ్రీకాంత్ కిచెన్‌లో భార్యకి ఏదో హెల్ప్ చేస్తున్నట్టున్నాడు.

"ముందిది చెప్పు? నువ్వు సత్తెయ్యకి ఉపయోగపడలేదని ఆలోచిస్తున్నావా? లేక నీవల్ల అతను జీవితాన్ని పోగొట్టుకున్నాడని బాధపడుతున్నావా!" విశ్వనాథం అంకుల్ ప్రశ్నకి నా దగ్గర జవాబు లేదు.

"నువ్వు మీ అమ్మగారు కోరినట్లుగా వొక్కసారి వెళ్ళి సత్తెయ్యను చూసి ఉంటే నీకింత మనస్థాపం కలిగుండేది కాదు చంద్రం! ఏమైనా 'మీ కాలం' అంటే మీరు అంటుంటారే పాస్టు యుగం..డబ్బుంటే కాలాన్ని సైతం వెనక్కి తేగలం అన్న అహం ఎక్కువయ్యా మీకు"

నేను మౌనంగా తలొంచుకున్నాను.

"నేను అలా అంటున్నానని నువ్వు మరోలా అనుకోకు. నేను, నాది, నా అనే పదాల కంటే 'మన' అనే పదం చాలా విశాలమైంది చంద్రం! నేను బాగున్నాను అనుకోవటం వేరు. మనం బాగున్నాము, మనవాళ్ళు బాగున్నారు అనుకోవటం వేరు. అందుకే ప్రతివారూ ఉభయకుశలోపరి అని ఉత్తరం రాయటం. ఆ వొక్క పదం చూసినప్పుడు మనస్సుకు ఎంత తృప్తినిస్తుందో తెల్సా! కొన్నాళ్ళ క్రితం నన్నందరూ 'ఉత్తరాల పిచ్చోడు' అనే వారు. ఇప్పుడు 'మెసేజ్‌ల పిచ్చోడు' అని నవ్వుకుంటూ ఉండొచ్చు. ఐనా నేనేం పట్టించుకోను. నాకు మన వాళ్ళందరూ క్షేమంగా ఉన్నారని తెలియటం సంతోషాన్నిస్తుంది."

ఆ పరిధిలో నేనూ ఉన్నానన్న విషయం గుర్తొచ్చి గుటకలు మింగాను.

"ఇప్పుడు ఎక్కడవిన్నా టైమ్ వేస్టు అనే పదం బాగా వాడుతున్నారు. మనకంటే ముందు పుట్టిన బంధాల గురించి ఆలోచించటం టైమ్ వేస్టా? మనవాళ్ళను తల్చుకోవటం, కల్సుకోవటం, టైమ్‌వేస్టా? నా చిన్నప్పుడు పెళ్ళి అంటే నెల ముందు నుంచే హడావిడి కన్పించేది. బంధుమిత్రుల రాకతో సందడి సందడిగా ఉండేది. ఇప్పుడు పెళ్ళి టైమ్‌కి వచ్చి ముహూర్తం టైమ్ వరకు ముళ్ళ మీద ఉన్నట్టుండి వెళ్ళిపోతున్నారు. ఎందుకంటే టైమ్ మెయింటెనెన్స్..."

విశ్వనాథం గారి మాటలు కొంచెం కొంచెం అర్థమవుతున్నట్టున్నాయి.

"డిన్నర్ రెడీ.." అంటూ శ్రీకాంత్ వచ్చాడు.

"పద చంద్రం! భోం చేస్తూ మాట్లాడుకుందాం.." అంటూ అంకుల్ ముందుకు నడిచాడు. నేను శ్రీ అనుసరించాము.

లక్ష్మి మాకోసం ఎదురుచూస్తూ ఉంది.

"నిత్యని కూడా తీస్కొస్తే బాగుండేది" అంది లక్ష్మి.

నేను నవ్వి ఊర్కున్నాను.

"ఈ కర్రీ వేస్కో... కొబ్బరి శెనగపప్పు కాంబినేషన్ లక్ష్మి బాగా చేస్తుంది" అంటూ శ్రీకాంత్ కూర నా ప్లేట్లో వేసాడు.

అమ్మ ఈ కూర తరచూ చేస్తుండేది. నిజంగా చాలా బాగుంది.

డిన్నర్ పూర్తయింది. భోం చేస్తు పెద్దగా ఏం మాట్లాడుకోలేదు. లక్ష్మి కొన్ని ఫ్రూట్స్ కట్ చేసి ప్లేట్లో పెట్టి మా ముందుంచింది.

"మా పిల్లలు కోట్లు సంపాదిస్తున్నారు అని చెప్పుకునే తల్లిదండ్రులు మా పిల్లలు మంచి పనులు చేస్తున్నారు అని చెప్పుకునే స్థాయికి ఎదగాలి. మొన్నామధ్య ఓ అమ్మాయి మెసేజ్ పంపింది. 'ఓ పేదవాడి భోజనం ఖరీదు పదిహేను రూపాయలు' అని. ఆ అమ్మాయి ఎందుకలా మెసేజ్ పంపిందో ఏమో! నేను చాలామందికి ఆ మెసేజ్ పంపించాను. ఎవరి పరిధిలో వాళ్ళు ఆలోచిస్తారని. ఎవరి స్థాయిలో వాళ్ళు హెల్ప్ చేస్తారేమోనని" అన్నారు అంకుల్.

"ఆ..చంద్రం! వన్ యియర్ తర్వాత మేము ఇండియా వెళ్ళిపోతున్నాము. ఇదే ప్రపంచం అనుకుని ఇన్నాళ్ళు చాలా ఫాస్ట్‌గా ముందుకొచ్చేసాము. కానీ మనకు సంబంధించి మరో ప్రపంచం మనకోసం ఎదురు చూస్తూ ఉందనిపిస్తోంది. పిల్లలు ఎక్కడ సెటిలయినా అది వాళ్ళిష్టం. ఇంత సంపాదించి మన వాళ్ళ మధ్య గడపలేకపోవటం ఏదో వెలితిగా అన్పిస్తోంది ఈమధ్య.." అంటూంటే శ్రీ కళ్ళు మెరిసాయి.


"నువ్వు సత్తెయ్య గురించి ఎక్కువగా ఆలోచించకు చంద్రం! అతని చెయ్యి పోవటానికి నువ్వు ఓ కారణం అయ్యావు అంతే. ఎవరి ఖర్మని వాళ్ళు అనుభవించాలి అని గీతలో శ్రీకృష్ణుడు చెప్పలేదూ" అంటూ ఆయన ముగించారు.

పిల్లలు ఆడుకోవడానికి తప్ప పనికిరాని మర్రి ఊడలా నేను. మహావృక్షంలా విశ్వనాథం అంకుల్. మొదటిసారిగా ఆయన్ను తలెత్తి చూడ్డానికి చాలా అవస్థ పడాల్సి వచ్చింది.

నేను శ్రీకి లక్ష్మికి గుడ్‌నైట్ చెప్పి బైటికొచ్చాను.

కార్లో కూర్చోబోతూ ఎందుకో పైకి చూసాను.

ఆకాశం చందమామతో చుక్కలతో నిండుగా నవ్వుతున్నట్టుంది.



## స్నేహ ఉవాచ

డబ్బుకంటే కీర్తి ఎంతో ముఖ్యం అంటుంది స్నేహ. కీర్తి వచ్చిందనుకోండి డబ్బు ఆటోమేటిగ్గా అదే వస్తుంది అనే అభిప్రాయం స్నేహది. తన కెరీర్‌లో కనీసం నాలుగు మంచి చిత్రాలైనా వుండాలని కోరుకుంటోంది. ఇప్పటి వరకూ నటించిన వాటిలో 'శ్రీరామదాసు' ఒక్కటే ఉత్తమ చిత్రంగా భావిస్తుందిట. ఇంకా మూడు సినిమాలైనా అలాంటివి చేయాలని ఆశిస్తోంది స్నేహ. మరి ఆమె కోరిక నెరవేరాలనే ఆశిద్దాం

ఐదేళ్ళపాటు తన భుజాల మీద నన్ను ఎత్తుకుమోసిన సత్తెయ్య గుర్తొచ్చాడు.

బడి నుంచి వచ్చే నాకోసం అమ్మ గుమ్మంలో నిలబడి ఎదురుచూడ్డం గుర్తొచ్చింది.

అమ్మ ఎదురుగా రాని రోజు బిక్కమొహంతో ఇల్లంతా వెతుక్కోవటం గుర్తొచ్చింది.

ఓనమాలు దిద్దిన బడి గుర్తొచ్చింది. నాకోసం ఎదురు చూసే ఆత్మీయులు గుర్తొచ్చారు. 'చందమామ రావే..జాబిల్లి రావే..' అని అమ్మ పాడిన పాట గుర్తు వచ్చింది.

ఆ రాత్రి ఒంటరిగా నిలబడ్డ నాకు తోడుగా చందమామ.

ఓదార్పుగా నా చెంపలను తడిమిన రెండు కన్నీటి చుక్కలు.